# పరాధీనులు

డా॥ పోతుకూచి వెంకటేశ్వర్లు




ఆ ప్రయాణం తప్పని సరే అయింది: తప్పించుకోవటానికి వీల్లేదు. ఇదే అవే మాటేమిటి, ఇల్లాంటివి ఎన్నో- ఎన్ని సందర్భాలలోనో-

ఆ తాలూకాలో ఏ మారు మూల ప్రాంతంలో పాలక వర్గీయులు, ప్రజా ప్రతినిధులు, వారి అభిమానులు, వారి అనుచరులు, వారినే ఆశ్రయించినవారు– వారి అండన బతికేవారు, వారిని బతికించే వారు, ఎవరు- ఎప్పుడు- ఏ ప్రాంతంలో మీటింగు ఏర్పాటు చేసినా రంగారావుకి ఆహ్వానం వచ్చేది.

తప్పదు మరి. అతను సివియర్ ఫెలో. అందునా పని చేస్తున్నది తాలూకా లెవెల్లో, మొబైల్ మెడికల్ యూనిట్లో–అందునా అన్నిటికి ఆ ప్రాంతపు అధికారో- తనపై ప్రభుత్వాధికారో రంగారావుకు కబురు పెట్టే వారు. రంగారావుకే దూరమనేవారు. మొదట్లో కొంచెం తొందరపాటుపడేవాడు గాని రాను రాను వాటికి అలవాటు పడి పోయాడు. అందుకే అన్ని వేళలా సిద్ధంగా వుండేందుకు ప్రథమ చికిత్సకి పనికి వచ్చే మందులు పరికరాలతో ఓ కిట్ని తయారు చేసి వుంచాడు. ఇవిగాక సందర్భాను సారంగా–అవసరానికి మరికొన్ని మందులు– పరికరాలు- పరివారం–అంతా క్షణాల మీద సిద్ధం చేసేవాడు.

అయితే ఓ సుగుణం ఏమంటే– తన క్రింద ఓ జీపు, డ్రైవరూ వున్నాడు. అందుకే ఏ క్షణంలో ఏ మారు మూలకు వెళ్ళాలన్నా కష్టం అనిపించేది కాదు. అక్కడ వసతి ఏర్పాటు చేసినా చేయకపోయినా తన వెహికల్లోనే ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నడిపేవాడు–దాంట్లోనే విశ్రాంతి తీసుకునే వాడు–పని ముగిసిన తర్వాత–పనిగట్టుకు వచ్చిన వాళ్ళు–పనుల కోసం వచ్చినవాళ్ళు– ఏమీ తోచక–ఏమీ పనిలేక మూగినవాళ్ళు– అందరూ వెళ్ళేంతవరకు–రొద సద్దుమణిగే వరకు– దారి సర్దుబాటయేంతవరకు ఆగి– ఆపైన తను తిరుగు ప్రయాణానికి సంకల్పించేవాడు.

రాను రాను రామారావు చాకచక్యం, నిశితనం, పట్టుదల, పదిమందికీ సమాధానం చెప్పేతీరు, పదిమందిని మెప్పించే వాక్యం, ఇవన్నీ పై ఆఫీసరు నోటీసుకు వెళ్ళిన తర్వాత, అలా ప్రయాణాలు దగ్గర ప్రాంతాలవేగాక ఆ జిల్లా మొత్తంమీద ఎక్కడ ఏ మీటింగయినా, ఏ ప్రజాప్రతినిధి వచ్చినా రామారావు ఫాలో అవటం జరిగేది.

అయినా రామారావు ఏం బాధపడేవాడు గాదు. సంతోషంగా తన సిబ్బందితో మందులతో అవసరమున్న చోటల్లా అవసరా లకు ఆదుకునేవాడు

ఈసారి నరసారావుపేట వద్ద ఓ పల్లెలో పెద్ద పేరు మోసిన ప్రజాప్రతినిధి మీటింగ్. దగ్గర్లో నరసారావుపేట వున్నా, అక్కడ తాలూకా వైద్యశాల వున్నా, అనుభవజ్ఞుడు గదా అని, అండగా వుంటా డని రామారావునే ఎంచుకోవటం జరిగింది.

యథాప్రకారం అన్నీ సిద్ధం చేసుకుని మీటింగు సాయంత్రం అయినా తీరుబడిగా ఉదయాన్నే స్పాట్కి చేరి, ప్రజాప్రతినిధులు ఏ వైపుకి వచ్చేది, మీటింగ్ స్పాట్, సీనునుంచి స్టేజిమీదకు వచ్చేది, మీటింగానంతరం, మీటింగు ప్లేస్ వరకు వాళ్ళు తిరుగు ప్రయాణమయ్యేది, అన్నీ పరిశీలించి, అనుకూలమైనచోటు ఎంచుకుని, అక్కడ రెడ్ క్రాస్ ఎంబ్లమ్ పెట్టి తను సిద్ధం అని తెలియజేశాడు.

అంతా అనుకున్న దాని కన్నా ఆలస్యంగా మహానీయులు రావటం, మామూలు స్వాగతాలు, వాగ్దానాలు, కోలాహలం అంతా ముగిసేటప్పటికి రాత్రి తొమ్మిది గంటలయింది.

అన్నీ సర్దుకుని తిరుగు ప్రయాణం మొదలెట్టారు. డ్రైవరు కడుసమర్థుడు. అందుకే మరో రెండు గంటల్లో గుంటూరు చేరుకోవచ్చునని ధైర్యంగా సీట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. జీపు వేగం పుంజుకుంది. ఎన్నో బండ్లను ఓవర్ టేక్ చేస్తూ అతివేగంతో నడుస్తున్న బండి సత్తెనపల్లి పొలిమేర్లలోకి వచ్చేసరికి సడన్గా ఇంజన్ ఆగిపోయింది.

అయితే డ్రైవర్ చెట్టు కొట్టకుండా జాగ్రత్తగా బండిని పక్కకి లాగి బ్రేకు వేసి నిలుపు చేశాడు. క్రిందకు దిగాడు. బోయినెట్ ఎత్తి తనిఖీ చేశాడు. పెట్రోలు చూశాడు. ట్యాంక్లో పెట్రోలు కొలిచాడు. మామూలు ప్రయత్నాలు అన్నీ చేసాడు. అయినా బండి మొండికేసింది. మొరాయించి నిల్చింది.

చెమటలు తుడుచుకుంటూ చెప్పలేక చెప్పలేక చెప్పాడు డ్రైవర్. "అయ్యా లోపం ఏమిటో అంతుపట్టటంలేదు. మీకా పొద్దు పోతోంది. మీరు ఇరకాటంలో చిక్కు కుంటారు. అందుకని ఎలాగూ సత్తెనపల్లి పొలిమేర్లకి వచ్చాంగనుక ఓ రిక్షామీద బస్ స్టాండుకు వెళ్ళి ఏ ఆర్. టి. సి బస్సులోనో పెందలకడే గుంటూరు చేరుకోండి. నేను నెమ్మదిగా దీన్ని నెట్టించుకు నేనో, మెకానిక్ని పిల్చి బాగు చేయించుకుని సాధ్యమైనంత త్వరగా బండి తెస్తా" చేతులు నలుపుతూ నీళ్ళు నములుతూ అన్నాడు డ్రైవర్

పాపం అతను మాత్రం ఏంచేస్తాడు? యిలా జరగటం యిదే మొదటిసారి. ఏం చేయటానికి తోచలా. ఓ విధంగా డ్రైవర్ చెప్పిందే మంచిదనిపించింది. బండి ఎప్పటికి రెడీ అవుతుందో.

అందుకే తటపటాయిస్తూ "సరే అవసరానికి యీ వంద వుంచు. అవసరమైతే ఏదన్నా పార్ట్సు వేయించాలంటే వేయించు. ఓచర్ తీసుకో. సాధ్యమైనంత త్వరగా వచ్చెయి" అంటుండగానే అటుగా పోతున్న రిక్షాను నిలిపి డాక్టర్ చేతిలోని డబ్బు భద్రంగా పుచ్చుకుని "అయ్యగార్ని బస్‌స్టాండు దగ్గర దింపు" అంటూ మంచివాడు కాబట్టి రిక్షా ఏర్పాటు చేసాడు డ్రైవర్.

ఆలోచనలతో బస్‌స్టాండు చేరిన రామారావుకు మరో ఆలోచన వచ్చింది. తన మేనమామ వుంటున్నది ఆ వూళ్ళోనే. ఎన్నోసార్లు రమ్మనమని గొడవచేసారు. ముఖ్యంగా వాళ్ళబ్బాయి, తన యీడువాడు అయిన శాయి. అందుకే వెంటనే ఆ ఎడ్రస్సుచెప్పి అక్కడకు పదమన్నాడు రిక్షావాడ్ని.

రామారావుని చూచి వాళ్ళింట్లో ఎంతగానో సంతోషించారు. అయితే బండీ ట్రబుల్ యిచ్చినందుకు విచారించినా, ఆ విధంగానైనా వాళ్ళ యింటికి వచ్చాడని ఆనందించారు.

మాటా మంతీ అయింతర్వాత, సుష్టుగా భోజనం ముగించి తమలపాకులు దట్టించిన పిదప శాయి ప్రోత్సాహం మీద సెకండ్ షో సినిమాకు బయలుదేరారు యిద్దరూను.

# పరాధీనులు

అయితే హాలు చేరుకున్న రామారావు చెరువు గట్టున పడ్డ చేప వలె గింజుకున్నాడు. కారణం తన జీపు అక్కడ పార్క్ చేసి వుండటమే! అయితే డ్రైవర్ కనబడలా, కారణం తెలుసుకోవటానికి. ఇంతలో టిక్కెట్టు తీసుకువచ్చి శాయి "పిక్చర్ స్టార్ట్ అవుతుంది—పద త్వరగా—" అనటంతో యాంత్రికంగా హాల్లోకి జొరబడ్డారు. అప్పటికే లైట్లు ఆరిపోయినాయి. టైటిల్స్ పడుతున్నాయి. మసక చీకటిలో వెనుక వరుసలోవున్న రెండు కుర్చీల్లో కూలబడ్డారు.

పిక్చరుకన్నా సమ వయస్కులు కాబట్టి వాళ్ళు ముచ్చట్లు చెప్పుకుంటున్నారు.

అయితే యింతలో ముందు వరుసలోని వాడి గొంతు పరిచయమున్నదిలా అనిపించింది. ఓ చెవి అటు పడేశాడు రామారావు.

"చాలా కాలానికి నీతో కల్సి కాలక్షేపం చేయటం పడిందిరా."

"అయినా చెప్పా పెట్టకుండా యిలా అకస్మాత్తుగా వూడిపడ్డావేమిటి?"

"యిది అన్ ఎక్స్‌పెక్టెడ్ (తలవని తలంపు). నర్సారావుపేటలో జరిగే మీటింగు దగ్గిర డ్యూటీ పడింది. తిరిగి వస్తున్న నాకు నిన్ను చూడాలనిపించింది. నీతో యీ రాత్రి గడపాలనిపించింది అందుకని..."

యీసారి స్పష్టంగా అర్థం అయింది—అది తన డ్రైవర్ గొంతు.

"మరి బండి ఎలా బ్రేక్ చేసావ్?" మిత్రుని గొంతు.

"ఏంచేయను, మా ఆఫీసరు మొండి ఘటం. స్నేహితుడ్ని చూడటానికి అడిగానంటే వినేరకం కాదు. అందుకే బండి ఎక్కిందగ్గర్నుంచి ఆలోచిస్తూనేవున్నా. ఆఖరుకు ఓ ప్లాను వేసా. యింజన్ ఫెయిల్యూర్ అని వూరి పొలిమేర్లో బండిని ఆపి వాడ్ని ఆర్. టి. సి. బస్సులో గుంటూరు పొమ్మన్నా..."

"అదేమిటి బండీ ఫెయిల్యూర్ ఏమిటి — నువ్వు బండి వేసుకునే వచ్చావుగా?"

"అదే మరి మన గొప్పతనం."

"అంటే!"

"యింజన్ ఫెయిల్యూర్ లేదు, వల్లకాడు లేదు. బండి వేగంగా పడుతోంది. మా డాక్టరు బాబు విశ్రాంతిగా వెనక్కు వాలి వున్నాడు. రెప్పపాటులో గేర్ న్యూట్రల్ చేసి యింజన్ స్విచ్ ఆఫ్ చేసా. బండి వేగం తగ్గటం మొదలెట్టేటప్పటికి కంగారుగా ముందుకు వంగాడు, జీపు గురించి—డ్రైవింగ్ గురించి ఏమాత్రం తెలియని మా డాక్టర్. అంతే బండీ ఫెయిల్యూర్ అంటూ ఎంతో చాకచక్యంగా ఆపినట్టు జీపును సైడుకు తీసి బ్రేక్ వేసి నిలుపుచేసా. లేని పోని తతంగంతో ఓ పావుగంట గడిపి, ఆఖరికి వాడ్ని అటు పంపించి, ప్రక్కనే వున్న కాలువలో చేతులు, మొహం కడుక్కుని యింజన్ ఆన్ చేసి జీపును నడుపుకు చక్కా వచ్చేసా..." ఎంతో ఎడ్వంచరస్‌గా చెబుతుంటే మరెంతో శ్రద్ధగా వింటున్నాడు మిత్రుడు.

యింటర్‌వెల్‌కి కొంచెం ముందే బయటకు వచ్చి తిరిగి ఆట ప్రారంభం అయిం తర్వాత హాల్లోకి అడుగు పెట్టాడు—అయితే మౌనంగా సినిమా చూసి గ్రూప్ ఫొటో [సినిమా చివరిలో] వస్తుండగా శాయితో కలిసి బయటకు వచ్చి జీపుముందు నిల్చున్నాడు రామారావు.

హైలా వచ్చినలా సినిమా చూసి, హుషారుగా సిగరెట్ దమ్ము లాగుతూ జీపు డోరుపై చెయ్యివేసిన డ్రైవర్, కదలిక లేకుండా, బొమ్మలా నిల్చుండి పోయాడు.

ఓపిక కూడగట్టుకుని, నోరు పెగుల్చుకుని, చలనం తెచ్చుకుని డాక్టర్ని సమీపించి "మీరు-మీరూ..."

"బండీ ఎలా బాగుపడిందిరా?"

"అదే నెట్టించుకుని... మెకానిక్.. తోయించుకుని...యింజను..." మాటలు



కరువైనాయి. ముచ్చెమటలు పోసాయి.

'వెధవాయ్! వుద్యోగంలో వుండదల్చుకోలేదా? నాకే టోకరా యిద్దామనుకున్నావా? యింజన్ ఆఫ్‌చేసి, యింజన్ ఫెయిల్యూర్ అంటావా?" హుంకరించాడు డాక్టర్ రామారావు.

"ప్రభో! క్షమించండి! నన్ను రక్షించండి. యీసారికి కాపాడండి. తప్పైపోయింది. బుద్ధి గడ్డి తిని- యీ తప్పు కాయండి. యిక ముందెప్పుడు యిలా చేయను..." అంటూ కుప్పలా డాక్టర్ పాదాల వద్ద పడ్డాడు.


# బ్రిటానియా పాల బిస్కట్



## పెరిగే పాపాయిలకు రుచివంతమైన తోడు!

రుచికరమైన, పుష్టికరమైన

బ్రిటానియా

మిల్క్ బికీస్




లింటాస్-BBC-MB-3-203 TE